Registered No : APTEL/25/A0818
ఇది కద నిజం
శనివారం 20-06-2026

# లాల్ దర్వాజా సింహవాహిని శ్రీ మహంకాళి దేవాలయాన్ని సందర్శించిన సీబీఐ ప్రత్యేక న్యాయమూర్తి శ్రీ కె. పట్టాభిరామారావు గారు



ఇది కద నిజం.. హైదరాబాద్, జూన్ 19, 2026: సీబీఐ ప్రత్యేక న్యాయమూర్తి శ్రీ కె. పట్టాభిరామారావు గారు చారిత్రాత్మక లాల్ దర్వాజా సింహవాహిని శ్రీ మహంకాళి దేవాలయాన్ని సందర్శించి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయ కమిటీ చైర్మన్ శ్రీ జి. అరవింద్ కుమార్ గౌడ్ గారు విశిష్ట అతిథికి ఘన స్వాగతం పలికి శాలువాతో సత్కరించారు. అనంతరం శ్రీ కె. పట్టాభిరామారావు గారు అమ్మవారి దర్శనం చేసుకొని హారతిలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ మాజీ అధ్యక్షులు శ్రీ బద్రీనాథ్ గౌడ్ గారు, కమిటీ సభ్యులు శ్రీ రంగ హరినాథ్ గౌడ్ గారు, శ్రీ దశరథ్ లాల్ గారు మరియు ఇతర దేవాలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేవాలయ కమిటీ విశిష్ట అతిథి ఆలయాన్ని సందర్శించినందుకు హర్షం వ్యక్తం చేస్తూ, అమ్మవారి అనుగ్రహం ఎల్లప్పుడూ ప్రజలపై, భక్తులపై ఉండాలని ఆకాంక్షించింది.

# రేపు పాతబస్తీ బోనాల ఏర్పాట్లపై సమావేశం..



ఇది కద నిజం. హైదరాబాద్:

రాబోయే ఆషాడ మాసం బోనాల జాతర ఉత్సవాలను పురస్కరించుకొని పాతబస్తీ లోని దేవాలయాల వద్ద చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై జిహెచ్ఎంసి రాజేంద్రనగర్ జోన్ జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాసరెడ్డి తో శనివారం ఉదయం సమావేశం జరగనుందని భాగ్యనగర్ శ్రీ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ చైర్మన్ మల్యాల మధుసూదన్ యాదవ్ తెలిపారు. రాజేంద్రనగర్ జోన్ పరిధి లోని చాంద్రాయణగుట్ట, బహదూర్ పురా నియోజక వర్గాల పరిధి లోని దేవాలయాల వద్ద అభివృద్ధి పనుల కోసం ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ ప్రతినిధులతో ఈ సమావేశం జరగనుందని ఆయన తెలిపారు.

# మెహదీపట్నం డిపోలో టీజేఎంయూలో భారీ చేరికలు



ఇది కద నిజం : హైదరాబాద్‌లోని మెహదీపట్నం డిపోలో తెలంగాణ జర్నీ మెన్ యూనియన్ (ఎజీవీఖ)లో భారీ సంఖ్యలో కార్మికులు చేరారు. టీఎంయూ, ఎంప్లాయీస్ యూనియన్‌తో పాటు పలు ఇతర యూనియన్లకు చెందిన ఉద్యోగులు స్వచ్ఛందంగా టీజేఎంయూలో చేరి సంఘానికి మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు కొత్తగా చేరిన సభ్యులకు స్వాగతం పలికి సంఘం లక్ష్యాలు, కార్యక్రమాల గురించి వివరించారు.

కార్మికుల సమస్యల పరిష్కారం, ఉద్యోగ భద్రత, హక్కుల పరిరక్షణ, సంక్షేమ చర్యల కోసం టీజేఎంయూ నిరంతరం పోరాటం చేస్తోందని నాయకులు పేర్కొన్నారు. ఉద్యోగుల ప్రయోజనాలను కాపాడడంలో యూనియన్ కీలక పాత్ర పోషిస్తోందనే నమ్మకంతోనే పలువురు ఉద్యోగులు టీజేఎంయూలో చేరారని తెలిపారు.

ఈ సందర్భంగా మాట్లాడిన నాయకులు, కార్మికుల సంక్షేమమే తమ ప్రధాన లక్ష్యమని, ఉద్యోగుల సమస్యలను యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. మెహదీపట్నం డిపోలో జరిగిన ఈ భారీ చేరికలు టీజేఎంయూ బలోపేతానికి నిదర్శనమని, భవిష్యత్తులో మరింత మంది కార్మికులు సంఘంలో చేరే అవకాశాలు ఉన్నాయని అభిప్రాయపడ్డారు. కార్మికుల ఐక్యతతోనే హక్కుల సాధన సాధ్యమవుతుందని వారు పిలుపునిచ్చారు.

# 'మీ కుటుంబానికి న్యాయం చేస్తాం'..

## సాయికృష్ణ తల్లికి సీఎం హామీ



అమరావతి ,ఇది కద నిజం జూన్ 19; విజయవాడ కృష్ణలంకకు చెందిన గాదె సాయి కృష్ణ తల్లి విజయలక్ష్మి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును సీఎం క్యాంపు కార్యాలయంలో కలిశారు. తన కుమారుడి అదృశ్యం ఘటనపై విచారణ జరిపి న్యాయం చేయాలని ముఖ్యమంత్రిని కోరారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఆమెకు ధైర్యం చెప్పారు. ఘటనపై నిష్పక్షపాతంగా దర్యాప్తు జరిపిస్తామని హామీ ఇచ్చారు. విజయలక్ష్మితో మాట్లాడి మొత్తం ఘటనపై వివరాలు తెలుసుకున్నారు. తన కుటుంబానికి న్యాయం చేస్తామని ముఖ్యమంత్రి హామీ ఇవ్వడంపై విజయలక్ష్మి సంతృప్తి వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రిని కలిసిన తర్వాత తమకు న్యాయం జరుగుతుందనే విశ్వాసాన్ని ఆమె వ్యక్తం చేశారు. సమగ్ర విచారణ జరిపి నిందితులకు శిక్ష పడేలా చూస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు హామీ ఇచ్చారని గాదె విజయలక్ష్మి తెలిపారు.

# ఏ.ఆర్.కానిస్టేబుల్ రౌతు పెంచల బాబు పై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి సిఐటియు జిల్లా కార్యదర్శి పంచేటి, శ్రీనివాసులు డిమాండ్



నెల్లూరు జిల్లా సైదాపురం(ఇది కద నిజం):– నెల్లూరు జిల్లా సైదాపురం మండలం కలిచేడు గ్రామం వడ్డీ పాలెంలో విధులు నిర్వహిస్తున్న అంగన్వాడి టీచర్ ఆదిలక్ష్మ పై అదే గ్రామానికి చెందిన రౌతు పెంచులు బాబు, అంగన్వాడి సెంటర్ కి వెళ్లి ఆదిలక్ష్మిని కాళ్లతో తన్ని నోటికొచ్చినట్టు తిడుతూ ఆదిలక్ష్మి పై దౌర్జన్యం చేసిన పెంచల బాబుపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి పంచేటి, శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అక్కడున్న కొంతమందిని దగ్గర పెట్టుకుని రౌతు దుర్గా, చిన్న ,రమణయ్య, దొరసాని , సుబ్బయ్య వీళ్ళని దగ్గర పెట్టుకుని రక్తం వచ్చేదాకా ఆదిలక్ష్మిపై దుర్మార్గంగా కొట్టడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం అలాగే పోలీసులు ప్రజలు కు అండగా ఉండాలని ఏఆర్ పోలీసులని పేరు చెప్పుకొని అందరి మీద దాడికి దిగడం మంచి పద్ధతి కాదని తెలియజేశారు. ఇలాంటి కానిస్టేబుల్ ని వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు ఆదిలక్ష్మి కుటుంబానికి సిఐటియు అండగా ఉంటుందని ఆదిలక్ష్మి న్యాయం జరిగేంతవరకు పోరాటం చేస్తామని తెలియజేశారు ఈ కార్యక్రమంలో సిఐటియు అంగన్వాడి ప్రాజెక్ట్ కార్యదర్శి ప్రమీల ఉపాధ్యక్షురాలు జయసుధ పాల్గొన్నారు.

# ఐటీ కారిడార్‌లో వర్షాకాల సన్నద్ధత, ట్రాఫిక్ నిర్వహణపై సమన్వయ సమావేశం




శేరిలింగంపల్లి (ఇది కద నిజం): వర్షాకాలంలో ప్రయాణికుల భద్రతను మెరుగుపరచడం, ట్రాఫిక్ రద్దీని సమర్థవంతంగా నిర్వహించడం, అలాగే అత్యవసర పరిస్థితులకు వేగవంతమైన స్పందన అందించేందుకు సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు, మున్సిపల్ అధికారులు, సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ (SCSC), మరియు వివిధ ఐటీ సంస్థల ప్రతినిధులతో ఉన్నత స్థాయి సమన్వయ సమావేశం నిర్వహించారు.

ఈ సమావేశంలో సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. ఎం. రమేశ్ IPS, జవీజ కమిషనర్ డా. సృజన IAS, అసిస్టెంట్ జవీజ కమిషనర్. వేణుగోపాల్ రెడ్డి, సైబరాబాద్ ట్రాఫిక్ డీసీపీ శేషాద్రిని రెడ్డి, అడిషనల్ డీసీపీ ట్రాఫిక్. హనుమంత్ రావు, అడిషనల్ డీసీపీ ట్రాఫిక్. నరేందర్ , ACP. చంద్రశేఖర్ రెడ్డి, SCSC CEO. నావెద్ మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఆకస్మిక భారీ వర్షాల సమయంలో తలెత్తే సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు, పౌర మరియు ట్రాఫిక్ అత్యవసర పరిస్థితులపై తక్షణ స్పందన అందించేందుకు అన్ని సంబంధిత ప్రభుత్వ శాఖల సమన్వయంతో సైబరాబాద్ కన్వర్జెన్స్ సెంటర్ (CCC) ను ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు.

ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించే నీరు నిలిచిపోయే ప్రాంతాలను ముందుగానే గుర్తించి నివారణ చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. ఐటీ కారిడార్ పరిధిలో రహదారులపై నిలిచిపోయే వాహనాలు, చెట్లు లేదా ఇతర అవరోధాలను తక్షణమే తొలగించేందుకు టోయింగ్ క్రేన్లు, వాటర్ పంపులు మరియు ప్రత్యేక క్విక్ రెస్పాన్స్ పెట్రోలింగ్ బృందాలను సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు.

# జాతీయ మలేరియా మాసోత్సవాలు




నెల్లూరు(ఇది కద నిజం):– జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, జిల్లా మలేరియా నియంత్రణ శాఖ మరియు కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్, (ది పిఎంపి అసోసియేషన్ ఆఫ్ ఇండియా) సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం, బుజబుజ నెల్లూరులోని కృష్ణచైతన్య నగర్ నందు మలేరియా మాసోత్సవాలను పురస్కరించుకొని మలేరియా వ్యాధిపై అవగాహన సదస్సు మరియు ర్యాలీ జరిగినది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న జిల్లా మలేరియా నివారణ అధికారి డాక్టర్ మైలపల్లి సింహచలం మాట్లాడుతూ భారతదేశంలో వర్షాకాలం ప్రారంభానికి ముందు ప్రజా ఆరోగ్యాన్ని కాపాడడానికి ప్రతి సంవత్సరం జూన్ మాసాన్ని జాతీయ మలేరియా వ్యతిరేక మాసోత్సవాలుగా నిర్వహిస్తారని తెలిపారు. ఈ మాసోత్సవాల ముఖ్య ఉద్దేశం దోమల వ్యాప్తిని అరికట్టడం, ఇంటింటికి ఫీవర్ సర్వేలు నిర్వహించడం, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించడం జరుగుతుందని అన్నారు. ప్రజా ఆరోగ్యానికి ప్రధాన శత్రువులు దోమలేనని, ఈ దోమలని పుట్టనీకుండా, కుట్టనీకుండా చేయడమే ధ్యేయంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. దోమలు పుట్టుట ద్వారా మలేరియా, ఫైలేరియా, (బోదవ్యాధి) డెంగ్యూ, మెదడు వాపు వ్యాధి, చికెన్ గున్యా వంటి వ్యాధులు వ్యాపిస్తాయని, మన ఇల్లు మరియు పరిసరాల్లో సాధారణంగా అనాఫిలిస్, క్యూలెక్స్, ఏడీస్ వంటి దోమలు పెరుగుతాయని తెలిపారు. ప్రతి శుక్రవారం (ఫ్రైడే డ్రైడే) ఇళ్లలోని కూలర్లు, కుండలు, ప్లాస్టిక్ డ్రమ్ములు, పాత టైర్లు, నిల్వ ఉన్న నీటిని పారబోసి దోమలు గుడ్లు పెట్టకుండా పొడిగా ఉంచాలని, మలేరియా వ్యాధి వ్యాప్తి చెందకుండా ఉండుటకు ఇంటి పరిసరాలలో క్రిమిసంహారిణి మందులు పిచికారి చేయించుకోవడం, డాక్టర్ సలహా మేరకు యాంటీ మలేరియా మందులు తీసుకోవడం, నీరు నిల్వగల ప్రదేశాలలో లార్వా నియంత్రణకు పిచ్చికారీ కార్యక్రమం చేపట్టడం, దోమతెర లోపల నిద్రించడం, ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం, కిటికీలకు వైర్ మెష్ లాంటివి అమర్చడం, పొడవాటి చేతులు కలిగిన దుస్తులు ధరించడం లాంటివి చేయాలన్నారు.

ర్యాలీని ప్రారంభించిన 25వ డివిజన్ కార్పొరేటర్ బద్దెపూడి నరసింహగిరి మాట్లాడుతూ జ్వరం, వణుకు, తలనొప్పి, ఒళ్ళు నొప్పులు, నీరసం వంటి లక్షణాలు కనిపించిన వెంటనే దగ్గరలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో రక్త పరీక్షలు చేయించుకొని, మలేరియా అని నిర్ధారణ అయిన తర్వాత క్రమం తప్పకుండా యాంటీ మలేరియా నివారణ మాత్రలు వాడాలని, మీకు సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రి లేదా ఆరోగ్య కేంద్రంలో ఉచితముగా మలేరియా పరీక్షలు మరియు దోమల నివారణ మందులు, దోమతెరలు అందుబాటులో ఉంటాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అనంతరం మలేరియా నివారణ అధికారి మైలపల్లి సింహాచలంను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అదనపు మలేరియా అధికారి జయరాం, పి.హెచ్.సి హాస్పిటల్స్ కోఆర్డినేటర్ కొండాపురం వెంకటేశ్వర్లు, శేషు స్కూల్ కరస్పాండెంట్ బి.ఆదిశేషు, కె.సురేష్, డి.రమేష్, జిల్లా పీయంపీ నాయకులు శాఖవరపు వేణుగోపాల్, గోరంట్ల శేషయ్య, దేవరకొండ శ్రీనివాసులు, గుంటిగంటి కృష్ణయ్య, ఆశా వర్కర్ యశోద తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

## -- ఎమ్మెల్యే శ్రీమతి గళ్ళా మాధవి

### ప్రజా గ్రీవెన్స్‌లో అర్జీలు స్వీకరించి, వెంటనే పరిష్కరించాలని అధికారులకు తక్షణ ఆదేశాలు



ఇది కద నిజం: గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ప్రజల సమస్యలను వేగంగా పరిష్కరించాలనే లక్ష్యంతో ప్రతి శుక్రవారం నిర్వహిస్తున్న ప్రజా గ్రీవెన్స్ కార్యక్రమంలో ఎమ్మెల్యే శ్రీమతి గళ్ళా మాధవి గారు పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. టీడీపీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమానికి నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు హాజరై తమ సమస్యలను ఎమ్మెల్యే గారి దృష్టికి తీసుకువచ్చారు.

ప్రజలు వినిపించిన సమస్యలను ఎమ్మెల్యే శ్రీమతి గళ్ళా మాధవి గారు ఓర్పుగా విని, సంబంధిత శాఖల అధికారులతో వెంటనే మాట్లాడి అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అర్జీలను సంబంధిత విభాగాలకు పంపిస్తూ సమస్యల పరిష్కారంపై నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తామని తెలిపారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీమతి గళ్ళా మాధవి గారు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారి మార్గదర్శకత్వంలో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న గ్రీవెన్స్ డే కార్యక్రమం ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా మారిందన్నారు. ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా వారి సమస్యలను నేరుగా ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకువచ్చే అవకాశం కల్పించడమే ఈ కార్యక్రమం ఉద్దేశమని చెప్పారు.

కూటమి ప్రభుత్వం ప్రజల సంక్షేమం, అభివృద్ధి, సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొన్నారు. ప్రజల నుంచి వచ్చే ప్రతి అర్జీని బాధ్యతగా తీసుకుని, సమస్య పూర్తిగా పరిష్కారం అయ్యే వరకు ఫాలోఅప్ చేస్తామని హామీ ఇచ్చారు.

ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండటం, వారి సమస్యలకు తక్షణమే స్పందించడం ప్రజాప్రతినిధిగా తన బాధ్యతగా భావిస్తున్నానని ఎమ్మెల్యే శ్రీమతి గళ్ళా మాధవి గారు స్పష్టం చేశారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకునేలా పారదర్శకంగా, జవాబుదారీతనంతో పనిచేస్తూ గుంటూరు పశ్చిమ నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని తెలిపారు.

## కోర్టు పరిధిలో ఉన్న దాంపత్య వివాదంలో

# పోలీసుల జోక్యంపై హైకోర్టు ఆగ్రహం

### మరోసారి జోక్యం చేసుకుంటే సుమోటోగా స్వీకరిస్తామని హెచ్చరిక




గంగలకుర్రు(ఇది కద నిజం)జూన్ 19: కోర్టు పరిధిలో విచారణలో ఉన్న భార్యాభర్తల దాంపత్య వివాదంలో పోలీసులు జోక్యం చేసుకోవడంపై ఆంధ్రప్రదేశ్ హైకోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. ఇలాంటి వ్యవహారాల్లో మరోసారి జోక్యం చేసుకున్నట్లు తేలితే సుమోటోగా కేసును స్వీకరించి తగిన చర్యలు తీసుకుంటామని కోర్టు హెచ్చరించినట్లు తెలిసింది.

అంబాజీపేట మండలం గంగలకుర్రు గ్రామానికి చెందిన మట్టా సాయిరాజుకు అదే మండలంలోని పేర్వేపాలెంకు చెందిన యువతితో వివాహం జరిగింది. అనంతరం భార్యాభర్తల మధ్య తలెత్తిన విభేదాలకు సంబంధించిన కేసు రంగారెడ్డి జిల్లా కోర్టులో పెండింగ్‌లో ఉండగా, సంబంధిత మహిళ అంబాజీపేట పోలీసులను ఆశ్రయించినట్లు పేర్కొంటున్నారు.

దీంతో అంబాజీపేట పోలీస్ స్టేషన్ ఎస్ఐ ఎస్.కె. సుభాన్ సాయిరాజు తల్లిదండ్రులను తరచూ పోలీస్ స్టేషన్‌కు పిలిపించి ఇబ్బందులకు గురిచేయడంతో పాటు పరుష పదజాలంతో దూషించారని ఆరోపిస్తూ బాధితులు హైకోర్టులో రిట్ పిటిషన్ నం. 15485 దాఖలు చేశారు. బాధితుల తరపున న్యాయవాదులు ఎం.వి. సుబ్బారావు మరియు బోను రామశంకర్ వాదనలు వినిపిస్తున్నారు.

పోలీసులు బాధితులను అనవసరంగా పోలీస్ స్టేషన్‌కు పిలిపించి వేధించినట్లు తెలిపే వీడియోలను కూడా కోర్టు ముందు సమర్పించినట్లు సమాచారం. అలాగే, సంబంధిత మహిళను బాధితుల ఇంట్లో ఉంచుకోవాలని ఎస్ఐ ఒత్తిడి తెచ్చారని, ఈ నెల 17న ఆమెను బాధితుల ఇంటికి పంపించిన విషయాన్ని కూడా కోర్టు దృష్టికి తీసుకువెళ్లినట్లు తెలుస్తోంది.

అదేవిధంగా, జూన్ 1న సాయిరాజు తల్లిదండ్రులను పోలీస్ స్టేషన్‌లో అక్రమంగా నిర్బంధించారని కోర్టుకు వివరించినట్లు సమాచారం. ఈ అంశాలపై హైకోర్టు తీవ్రంగా స్పందించినట్లు తెలిసింది.

ఇదిలా ఉండగా, అక్రమ నిర్బంధం ఆరోపణలపై సంబంధిత ఎస్ఐతో పాటు ఇతర కానిస్టేబుళ్లపై మేజిస్ట్రేట్ కోర్టులో ప్రైవేట్ ఫిర్యాదు దాఖలు చేసేందుకు హైకోర్టులో మరో ఇంటర్‌లోక్యుటరీ అప్లికేషన్ (ఐ.ఏ.) దాఖలు చేసి తగిన ఆదేశాలు పొందనున్నట్లు బాధితులు తెలిపారు.

అలాగే, కోర్టు పరిధిలో ఉన్న కుటుంబ వివాదానికి సంబంధించి కౌన్సెలింగ్ పేరుతో కలెక్టర్ కార్యాలయం నుంచి తరచూ ఫోన్ కాల్స్ చేసి ఇబ్బందులకు గురిచేస్తున్న అధికారులపై కూడా మేజిస్ట్రేట్ కోర్టును ఆశ్రయించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని బాధితులు వెల్లడించారు...

# సినిమా న్యూస్

## అల్లు అర్జున్‌కు మరో బిగ్ షాక్

### రిక్వెస్ట్‌ను తిరస్కరించిన కోర్టు



ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లోని సంధ్య థియేటర్ తొక్కిసలాట కేసులో టాలీవుడ్ స్టార్ హీరో అల్లు అర్జున్‌కు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. నాంపల్లి కోర్టు జారీ చేసిన సమన్లపై స్పందించిన ఆయన.. కోర్టుకు వ్యక్తిగతంగా హాజరవడం నుండి మినహాయింపు ఇవ్వాలంటూ దాఖలు చేసిన పిటిషన్‌ను న్యాయస్థానం తోసిపుచ్చింది. ప్రస్తుతం తాను సినిమా షూటింగ్ నిమిత్తం ముంబైలో బిజీగా ఉన్నానని, అందువల్ల ఈ నెల 22వ తేదీ నాడు కోర్టుకు వ్యక్తిగతంగా హాజరుకాలేనని అల్లు అర్జున్ తన పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో తనకు వ్యక్తిగత హాజరు నుండి మినహాయింపు ఇవ్వాలని, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విచారణకు హాజరయ్యేలా అనుమతించాలని ఆయన కోర్టును కోరారు.

పిటిషన్ కొట్టేసిన నాంపల్లి కోర్టు..

అల్లు అర్జున్ దాఖలు చేసిన ఈ పిటిషన్‌ను పరిశీలించిన నాంపల్లి కోర్టు.. అందుకు అనుమతించేందుకు నిరాకరించింది. వీడియో కాన్ఫరెన్స్ విజ్ఞప్తిని తోసిపుచ్చుతూ ఆయన పిటిషన్ను న్యాయస్థానం డిస్మిస్ చేసింది. ఈ కేసులో పోలీసులు దాఖలు చేసిన చార్జ్ షీట్లో అల్లు అర్జున్ 11వ నిందితుడిగా (ఏ11) ఉన్న సంగతి తెలిసిందే. కోర్టు పిటిషన్ను కొట్టేయడంతో.. పూర్వపు ఆదేశాల ప్రకారం ఈ నెల 22వ తేదీ సోమవారం నాడు నాంపల్లి కోర్టులో అల్లు అర్జున్ వ్యక్తిగతంగా హాజరుకావాల్సిందేనని స్పష్టమవుతోంది. థియేటర్ యాజమాన్యంతో పాటు నోటీసులు అందుకున్న మిగతా 19 మంది కూడా అదే రోజు కోర్టుకు రానున్నారు.



## నితిన్ సినిమా నుంచి తప్పుకున్న రితికా నాయక్

టాలీవుడ్ హీరో నితిన్ గత ఏడాది చేసిన తమ్ముడు, రాబిన్ హుడ్ మూవీస్ ఆశించినంత స్థాయిలో మెప్పించలేకపోయాయి. భారీ అంచనాల మధ్య వచ్చి బాక్సాఫీసు వద్ద బోల్తాపడ్డాయి. దీంతో కాస్త నిరాశ చెందిన నితిన్ కొన్ని రోజులు బ్రేక్ తీసుకున్నారు. ఈసారి ఎలాగైనా పక్కా హిట్‌తో ప్రేక్షకులను అలరించడానికి సరికొత్త ప్రాజెక్ట్‌తో సిద్ధమయ్యారు. టాలీవుడ్‌లో ఎన్నో బ్లాక్‌బస్టర్ హిట్స్ అందించిన ప్రముఖ నిర్మాణ సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌లో నితిన్ తన తదుపరి చిత్రాన్ని చేస్తున్నారు. ఈ సినిమా ద్వారా నారి సిరిసవాడ , సోమశేఖర్ అనే ఇద్దరు ప్రతిభావంతులైన యువకులు దర్శకులుగా ఇండస్ట్రీకి పరిచయం కాబోతున్నారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో నిర్మాత సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య ఈ చిత్రాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్న ఈ సినిమాలో నితిన్‌కు జోడీగా మొదట రితికా నాయక్‌ను హీరోయిన్‌గా ఎంపిక చేసినట్లు చిత్ర యూనిట్ అధికారికంగా ప్రకటించింది.

ఇప్పటికే ఈ సినిమాకు సంబంధించిన పూజా కార్యక్రమాలు ఘనంగా పూర్తి కావడమే కాకుండా, షూటింగ్ కూడా శరవేగంగా సాగుతోంది. పనులన్నీ త్వరగా పూర్తి చేసి, ఈ క్రమంలో.. తాజాగా, ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించి ఒక ఆసక్తికరమైన వార్త సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతోంది. ఈ చిత్రం నుండి హీరోయిన్ రితీకా నాయక్ తప్పుకున్నట్లు వార్తలు వస్తున్నాయి. అయితే ఆమె తప్పుకోవడానికి గల అసలు కారణాలు ఏంటనేది తెలియనప్పటికీ.. రితికా స్థానంలో 'బేబీ' సినిమాతో ఓవర్ నైట్ స్టార్‌డమ్ తెచ్చుకున్న టాలీవుడ్ యంగ్ బ్యూటీ వైష్ణవి చైతన్యను హీరోయిన్‌గా ఎంపిక చేసినట్లు గట్టిగా టాక్ వినిపిస్తోంది. నితిన్ సరసన వైష్ణవి అయితే పర్ఫెక్ట్‌గా సెట్ అవుతుందని భావించి, మూవీ టీమ్ ఆమెను దాదాపు ఫైనల్ చేసినట్లు సమాచారం. ఇందులో నిజమెంత అనేది తెలియనప్పటికీ ప్రస్తుతం ఇందుకు సంబంధించిన పోస్ట్‌లు సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతున్నాయి.



## 'భారతవర్ష' నుంచి 'ఓ ధీరా'

మాచో హీరో గోపీచంద్ నటిస్తున్న భారీ పాన్ ఇండియా చిత్రం 'భారతవర్ష'. 'ఘాజీ' ఫేమ్ సంకల్ప్ రెడ్డి దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న ఈ మూవీలో రీతూ వర్మ హీరోయిన్‌గా నటిస్తుండగా, శ్రీనివాస చిట్టూరి నిర్మిస్తున్నారు. భారత చరిత్రలోని ఒక అన్వేషించని చారిత్రక ఘట్టం ఆధారంగా తెరకెక్కుతోన్న ఈ సినిమా నుంచి ఇప్పటికే వచ్చిన టీజర్, గ్లింప్స్‌తో మంచి బజ్ క్రియేట్ అయింది. ఇప్పుడు ఇదే జోష్‌తో తాజాగా ఫస్ట్ సింగిల్ రిలీజ్ చేశారు మేకర్స్. 'ఓ ధీరా' అంటూ సాగుతూ మంచు పర్వతాల నడుమ ఒంటరి యోధుడి పోరాటాన్ని అద్భుతమైన విజువల్స్‌తో ఆవిష్కరించిన ఈ పాటకు అనుదీప్ దేవ్ అందించిన సంగీతం, చంద్రబోస్ సాహిత్యం, దీపక్ బ్లూ గాత్రం ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. దర్శకుడు సంకల్ప్ విజన్, గోపీచంద్ పవర్‌ఫుల్ స్క్రీన్ ప్రెజెన్స్ కలిసి ఈ చిత్రాన్ని గ్రాండ్ సినిమాటిక్ అనుభూతిగా నిలబెట్టేలా కనిపిస్తున్నాయి. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉన్న ఈ చిత్రంపై 'ఓ ధీరా' పాటతో భారీ హైప్ నెలకొంది.

## దయచేసి తప్పుడు వార్తలను నమ్మకండి

ఇన్నాళ్లు తన అద్భుతమైన నటన, డ్యాన్స్‌తో మ్యాజిక్ క్రియేట్ చేసిన ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని ఇప్పుడు మెగా ఫోన్ పట్టనున్నారు. ఆయన దర్శకత్వంలో రాబోతున్న లేటెస్ట్ సినిమా 'రాపో-23'. ఈ చిత్రానికి సంబంధించిన అధికారిక ప్రకటన కూడా కూడా విడుదలై అంచనాలను పెంచింది. ఇందులో ఆయన వీర అనే పవర్ ఫుల్ పాత్రలో కనిపించనున్నారు. ఇది ఎవరూ ఊహించని విధంగా ఒక ఉత్కంఠభరితమైన, సైకలాజికల్ యాక్షన్ థ్రిల్లర్‌నేపథ్యంలో తెరకెక్కనున్నట్లు టాక్. 'ది స్టోరీ ఆఫ్ ఏ లోన్ వోల్ఫ్' అనే ట్యాగ్‌లైన్‌తో రాబోతుంది. ఈ చిత్రాన్ని రామ్ సినిమాటిక్స్ అనే కొత్త ప్రొడక్షన్ హౌస్‌ను కూడా ప్రారంభించగా.. రామ్ సోదరుడు కృష్ణ పోతినేని నిర్మిస్తున్నారు.

అయితే, ఈ సినిమాలో నటించేందుకు నటీనటులు కావాలంటూ సోషల్ మీడియాలో కొన్ని కాస్టింగ్ కాల్ పోస్టర్లు వైరల్ అవుతున్నాయి. దీనిపై చిత్ర యూనిట్ తాజాగా స్పందిస్తూ ప్రేక్షకులకు, అభిమానులకు ఒక కీలక హెచ్చరిక జారీ చేసింది. "రాపో-23 సినిమాకు సంబంధించి కొన్ని అనధికారిక, ఫేక్ కాస్టింగ్ కాల్ పోస్టర్లు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నట్లు మా దృష్టికి వచ్చింది. దయచేసి ఎవరూ వాటిని నమ్మి మోసపోకండి. సినిమా టీమ్‌కు చెందిన వాళ్లమని చెప్పుకునే ఎవరికీ మీ వ్యక్తిగత వివరాలను పంచుకోవద్దు. మా చిత్రానికి సంబంధించిన ఎలాంటి అధికారిక కాస్టింగ్ కాల్స్ లేదా అప్‌డేట్స్ అయినా సరే.. కేవలం మా అఫీషియల్ సోషల్ మీడియా హ్యాండిల్స్ ద్వారా మాత్రమే ప్రకటిస్తాము" అని మేకర్స్ హెచ్చరించారు. ఈ ప్రకటనతో పుకార్లకు చెక్ పడినట్లయింది. దీంతో అది చూసిన రామ్ అభిమానులు అప్రమత్తమవుతున్నారు.







## 'కన్నప్ప' రీరిలీజ్

గత ఏడాది భక్తిప్రధాన 'కన్నప్ప' పాత్రలో ప్రేక్షకుల్ని మెప్పించారు హీరో మంచు విష్ణు. ఈ పాన్ ఇండియా చిత్రంలో మోహన్‌బాబు, అక్షయ్‌కుమార్, మోహన్‌లాల్, ప్రభాస్, కాజల్ వంటి అగ్ర తారలు భాగమైన విషయం తెలిసిందే.

ఈ సినిమా విడుదలై ఏడాది పూర్తయిన సందర్భంగా జూన్ 27న మరోమారు ప్రేక్షకుల ముందుకుతీసుకొస్తున్నట్లు మంచు విష్ణు తెలిపారు. థియేటర్‌లో చూసి ఆస్వాదించాల్సిన విజువల్ ఫీస్ట్ ఇదని, పరిమిత స్క్రీన్లలో చిత్రాన్ని రీరిలీజ్ చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ఈ చిత్రానికి ముఖేష్‌కుమార్ సింగ్ దర్శకత్వం వహించారు.